

# మాటా మంతీ

## - సాయి పద్మ



***24***

## ఇరవైనాలుగు కాలాలూ.. గంటలూ

ఈ కాలమ్ తో కౌముది మాటా – మంతీ ఇరవై నాలుగు నెలలు పూర్తి అయింది. వోకోసారి అనిపిస్తుంది, రాయటం అనేది ఎంత ఇరవై నాలుగు గంటలలో ఎప్పుడో ఒకసారి తప్పనిసరిగా గుర్తొస్తోంది అంటే , రాయటానికి ఎంత అలవాటు పడ్డామో, పైగా, రాయటం అనేది, ఒక జీవన స్మరణ లా తయారయినప్పుడు, ఇది కూడా వొక అడిక్షనే అనిపిస్తుంది, కొంచం ఆహ్లాదకరమైనది కావచ్చు. ఎవరికైనా నోస్టాల్జియా చాలా ఇష్టమైన విషయం, భరించేటప్పుడు ఎంత తిట్టుకున్నా కొన్ని కండిషన్స్ ని, తర్వాత అది అందమైన సీతాకోక చిలుక లాంటి జ్ఞాపకం. నెలాఖరు అవగానే, కాంతి గారికి, కిరణ్ గారికి కాలమ్ పంపించేయాలి అని గుర్తు చేసేంత అందమైన మురిపెం అన్నమాట.

అందుకే ఇవాళ రాయటం గురించి మాట్లాడుకుందాం. ఆలోచన ఉన్న ప్రతీవాళ్ళకీ, ఎంతో కొంత రాయాలని అనిపిస్తుంది. లేదా చదివిన వాటిల్లో, తనకు దగ్గరగా ఉన్న భావాన్ని ఎంచుకొని, పంచుకోవాలని కూడా అనిపిస్తుంది.ఇవాళ రాయటం అనేది, మంచినీళ్ళు తాగినంత ఈజీ అయిపోయింది. ఎందులో, వోకదానిలో, ఏదో వొక అభిప్రాయం రాస్తూనే ఉన్నారు. అది ప్రింట్ మీడియా అయినా, వెబ్ మీడియా అయినా, లేదా ఫేస్ బుక్ పోస్ట్ అయినా..!

ఆలోచనల సముదాయాల్లో, బోల్డంత అక్కర్లేని విషయాలు, ధాన్యంలో పొల్లులా, రాళ్ళల్లా ఉంటుంది. అది రాసేవాళ్ళకి గానీ, చదివేవాళ్ళకి గానీ , ఏ రకమైన సహాయం చేయకపోగా, సాహిత్యం పట్ల, మానవ సంబంధాల పట్ల ఒక అయోమయాన్ని కలుగజేస్తుంది. ఇలాంటివి కొన్ని అయితే, కేవలం ఒకవైపు విని,లేదా చదివి, అర్ధం చేసుకొని, రాసే అభిప్రాయాలు మరికొన్ని. ఇవి ఎంత ఉద్రిక్తతలను కలుగ జేస్తాయో, ఏ సోషల్ మీడియా ని వార్తలను చూసినా అర్ధం అవుతుంది.

రాయటం ఎంత బాధ్యత గల పనో, అంతే ఏకాంతమైన పని కూడా.. వొక నిరంకుశ ఏకాంతాన్ని కోరుతుంది రచనా ప్రక్రియ. అది వొక్కోసారి, రచయిత బలహీనతల్ని కూడా అధిగమించి రాయాల్సిన విషయం. చాలాసార్లు ఏదన్నా, వాదాల్లోనో, వర్గాలకి లోబడి రాసేవాళ్ళని చూస్తే భయం వేస్తుంది. తాను నమ్మిన విషయంపై ఎంత నిరంకుశంగా ఉంటారో తలిస్తే, జాలేస్తుంది.

The first draft is just you telling yourself the story...!!

~~Terry Pratchett ఇది వొక ఫేమస్ కొటేషన్. ఎన్ని పోస్ట్ స్క్రిప్ట్స్ , ప్రీ స్క్రిప్ట్స్ చదివినా, నాకైతే, ఇది అందరూ అన్ని చోట్ల అతికించి, మనసులో ముద్రించుకోవాలి అనిపిస్తుంది. ఎందుకంటె, మనం కన్విన్స్ కాని, ప్రేమించని ఏ కత అయినా రాత అయినా , ఇవతలి వాళ్ళని కన్ఫ్యూజ్ చేయటానికి తప్ప మరెందుకూ పనికిరాదు.

తిలక్ అంటారు– నా అక్షరాలూ వెన్నెల్లో ఆడుకొనే ఆడపిల్లలు అని, ఇవాల్టి కాలంలో వెన్నెలనీ వెన్నముద్ద నీ కూడా పరిచయం చేయాల్సిన పరిస్థితి. అందుకే, సంయమనం , క్లారిటీ అవసరం, కవికైనా , రచయిత కైనా.. !!

వొక వాక్యం చిత్రం కావాలంటే

ఛిద్రం కానక్కరలేదు

చిత్రికా పట్టనవసరం లేదు

దేహాల సరిహద్దుల్లో

అనుభూతుల ఆత్మని

పట్టుకుంటే చాలు

జలదరింపుల కదలికల్లో

మానవత చెంపదెబ్బలా

భావుకత చల్లగాలిగా

మట్టి స్పర్శలా తగిలితే చాలు

ఒకోసారి అనుకుంటాను... ఈ శరీరం ప్రొటెక్ట్ చేస్తోంది లేకపోతే ఎప్పుడో చెల్లా చెదురయ్యేవాళ్ళం అని.. ( ఇప్పుడు కాలేదని కాదు )

ఆలోచిస్తే అనిపిస్తుంది.. జెన్ మాంక్స్ ఇలాగె శరీరాన్ని , ఒక చిన్ని పూల తోట నీ పెంచుతూ బ్రతికేసి ఉంటారు.. అందుకే అంత గాఢంగా రాయగలిగారు..!! ఇన్ని అక్షరాల మధ్య సాహిత్యాన్ని, అందులో సంబరాన్ని వొడిసిపట్టుకొని, మనసులో దాచుకోవటం తక్కువ సాహసమేమీ కాదు.. మీరేమంటారు ?

మళ్ళీ కలుద్దాం .. వచ్చే నెల.. ఇరవై నాలుగు నెలలు, ఇరవై నాలుగు గంటల్లా .. రాసుకొనే అవకాశం ఇచ్చినందుకు కౌముదికీ.. చదువుతున్న మీకు, ధన్యవాదాలు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments